# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 17-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపించడంలో యువత కీలక పాత్ర పోషిస్తున్నారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు.
- ❖ భాతదేశ సాంస్కృతిక వారసత్వంలో యోగా ఒక అంతర్భాగమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ దేశ వ్యాప్తంగా 108 మల్టీ మోడల్ కార్గో టెర్మినల్స్ త్వరలో సేవలందించనున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ❖ ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడున్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

=============================

దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపించడంలో యువత, విద్యార్థుల కీలక పాత్ర పోషిస్తున్నారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ... వికసిత్ భారత్ అనేది కళ కాదని, బలమైన ఆర్థిక వ్యవస్థతో నడిచే ఒక నిర్దిష్ట గమ్యస్థానం అని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలను తొలగించడానికి విద్య దోహపడుతుందన్నారు. జాతీయ విద్యా విధానం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. దేశ విద్యా రంగంలో పెట్టుబడులు పెట్టాలని, గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులుగా ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను సృష్టించడానికి కార్పొరేట్లు, వ్యాపార పరిశ్రమలు వనరులను సమీకరించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశ అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై దృష్టి సారించిందన్నారు. బ్లూ ఎకానమి నుండి అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ వరకు.. ఆవిష్కరణల నుండి పరిశోధన వరకు దేశ యువతకు ప్రతిరోజూ అపారమైన అవకాశాలు ఉద్భవిస్తున్నాయని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=============================

భాతదేశ సాంస్కృతిక వారసత్వంలో యోగా ఒక అంతర్భాగమని, ఇది శరీరం మనస్సు మధ్య సంపూర్ణ సమతుల్యతను సాధించడంలో సహాయ పడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను ప్ర ప్రధానమంత్రి విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.

యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యత స్ఫూర్తిని కూడా ప్రతిబింబిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి పంచాయతీ పరిధిలో జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వీలైనంత ఎక్కువ మందిని భాగస్వాములను చేసి విజయవంతం చేద్దామని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

=============================

దేశ వ్యాప్తంగా 108 మల్టీ మోడల్ కార్గో టెర్మినల్స్ త్వరలో సేవలందించనున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈరోజు హర్యానాలోని మనేసర్‌లో దేశంలోనే అతిపెద్ద గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 45 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ కార్గో టెర్మినల్ 4 లక్షల 50 వేల వాహనాలను తీసుకెళ్లగలదని తెలిపారు. మల్టీ మోడల్ నెట్‌వర్క్ ప్రభుత్వ దార్శనికతను సాకారం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియను సరళీకృతం చేయడానికి 2021లో తీసుకువచ్చిన సంస్కరణలు దోహదపడుతున్నాయని అశ్వినీ వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

విరామం

=============================

ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య పెరుగుతున్న పరిస్థితుల ఘర్షణల నేపథ్యంలో భారతీయులను తరలించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా 110 మందితో కూడిన మొదటి బ్యాచ్ ఇప్పటికే అర్మేనియం చేరుకుందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈరోజు ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా భారతీయులను తరలిస్తున్నామని ఆ శాఖ పేర్కొంది. సొంత రవాణా సదుపాయం ఉన్నవారు కూడా ఆ ప్రాంతాన్ని వీడాలని కోరింది. ఈ క్రమంలో 110 మంది పౌరులను తొలి బ్యాచ్ కింద అక్కడి నుంచి తరలించినట్లు తెలిపింది. వీరంతా రేపు ఢిల్లీకి రానున్నారని వెల్లడించింది.

ఇదిలా ఉండగా ఆయా దేశాల్లో నివసిస్తున్న భారతీయ పౌరులకు సహాయం చేయడానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) 24 గంటల పాటు సేవలను కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. సహాయం కోసం టోల్-ఫ్రీ నంబర్ 1800 118 797 హెల్ప్ లైన్ నెంబర్‌ను సంప్రదించ వచ్చని తెలిపింది. అదే విధంగా 99682 91988 అనే ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను కూడా అందుబాటులో ఉంచామని పేర్కొంది.

=============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

============================

ప్రకృతిని పరిరక్షించి సమతుల్యమైన పర్యావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి భాద్యత అని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. ఈరోజు జోధ్‌పూర్‌లో ఎడారీకరణ, కరవును ఎదుర్కోవడానికి గల వ్యూహాలు అనే అంశంపై జరిగిన జాతీయ కార్యశాల ప్రారంభ సమావేశంలో కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భగా భూపేంద్ర యాదవ్ ప్రసంగిస్తూ... సాంకేతికత సహాయంతో ఏదైనా సృష్టించగల మానవులు ప్రకృతికి ప్రత్యామ్నాయాన్ని సృష్టించలేరని అన్నారు. అందువల్ల ప్రకృతి పరిరక్షణతో పాటు వాటి వినియోగంపై శ్రద్ధ చూపాలన్నారు. మన అభివృద్ధి కోసం ప్రకృతిని నాశనం చేయడం వలన భూమి ఉష్ణోగ్రత పెరుగుతోందని తెలిపారు. నదులు, పర్వతాలు, మహాసముద్రాలు వంటి సహజ వనరులను ఆదా చేస్తూనే... పర్యావరణ సమతుల్యతతో అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని భూపేంద్ర యాదవ్ పేర్కొన్నారు.

============================

దేశ రాజధాని ఢిల్లీలో 33 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, 17 జన్ ఔషధి కేంద్రాలను ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 1,100 కి పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లను వచ్చే సంవత్సరం మార్చి నాటికి ప్రారంభిస్తామని ప్రకటించారు. 5 సంవత్సరాల క్రితం ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం 2 వేల 400 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, కానీ గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అమలు చేయలేదన్నారు. అవసరమైన సౌకర్యాలతో ఆరోగ్య మందిర్లు కీలకమైన ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

============================

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక ఆవిష్కరణలకు చిహ్నంగా మార్చేందుకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పారిశ్రామిక కారిడార్ల కింద నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NICDC) నేతృత్వంలోని పారిశ్రామిక కేంద్రాల పురోగతిపై గుంటూరులో కేంద్రమంత్రి ఈరోజు సమీక్షా సమావేశానికి నిర్వహించారు.

============================

అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే అన్ని మార్గాలను నో ఫ్లయింగ్ జోన్‌గా జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ప్రకటించింది. యాత్రికుల భద్రతా దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. మరికొద్ది రోజుల్లో ఈ యాత్ర ప్రారంభం కానున్న నేపధ్యంలో జమ్మూకశ్మీర్ ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసింది. ఇందులో భాగంగానే.. ఈ నిర్ణయం తీసుకున్నామని జమ్మూకశ్మీర్ హోం మంత్రిత్వ శాఖ ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.

============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,796 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై... చివరకు 213 పాయింట్ల నష్టంతో 81,583 వద్ద ముగిసింది. నిఫ్టీ 93.10 పాయింట్ల నష్టంతో 24,853 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.24గా ఉంది.

============================
============================